క్లుప్తంగా

ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి

జడ్చర్ల: స్వాతంత్య్ర పోరాట యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి అందరికీ స్ఫూర్తిదాయకమని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి తెలిపారు. శనివారం లక్ష్మీబాయి వర్ధంతిని పురస్కరించుకుని తమ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె సేవలను కొనియాడారు.కార్యక్రమంలో శిరీష, సంతోష్, శ్రీదేవి, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ బంధు’ అమలు చేయాలి

జడ్చర్లటౌన్: సీఎం కేసీఆర్ రెండు సంవత్సరాల కిందట ఇచ్చిన బీసీ బంధు పథకం హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ సేన ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీసీ కుల వృత్తుల వారికి రూ. లక్ష సాయంతో పాటు బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్ ద్వార రుణాలు మంజూరు చేయాలన్నారు. తద్వారా బీసీల అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. నాయకులు విజయ్, నర్సింహ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వెంకటేశ్వరకాలనీ 11 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా ఆదివారం పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 3 ఏఈ భగవంతయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనగర్, పద్మావతికాలనీ, వెంకటేశ్వరకాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ కుమార్తె కాదాంబరి నీట్‌లో ఆలిండియా ర్యాంకు సాధించడంతో శనివారం ప్రజాప్రతినిధులు సత్కరించారు. నీట్‌లో 720 మార్కులకు గాను 695 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 495వ ర్యాంకు పొందిన నేపథ్యంలో విద్యార్థినిని అభినందించారు. ఆమె నివాసంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కోప్షన్ మెంబర్ మహిమూద్, సూపరింటెండెంట్ శివప్రసాద్, విజయకుమార్‌రెడ్డి, రమేష్, జైపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మీనాంబరం ఆలయ అభివృద్ధికి కృషి

జడ్చర్ల: ఆల్వాన్‌పల్లి శివారులోని మీనాంబరం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఆలయంలోని పరుశవేదీశ్వరస్వామిని శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సీసీరోడ్ల నిర్మాణంతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బాలానగర్: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మండల కేంద్రంలో పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇసుక టిప్పర్‌కు సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో మైనింగ్ అధికారులకు స్వాధీన పరిచినట్లు సమాచారం. అదే విధంగా ఓవర్ లోడ్‌తో ములుగు జిల్లా నుంచి పాలమూర్‌కు 16 టన్నుల అధిక బరువుతో వెళ్తున్న ఇసుక లారీపై ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ విజయ్ తెలిపారు.

మొక్కలు సిద్ధం చేయండి

నవాబుపేట: హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని యన్మన్‌గండ్ల, లింగంపల్లి, కిషన్‌గూడ గ్రామాల్లోని నర్సరీలను శనివారం పరిశీలించారు. మొక్కలకు క్రమంగా నీరు పోయాలని సూచించారు. మొక్కలు నాటే సమయంలో వాటి పాదులు ఆరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, సర్పంచ్‌లు సురేందర్, అంజమ్మ, జయమ్మ, సోని తదితరులు ఉన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర రూరల్: పది రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన కొౌకుంట్ల మండల పరిధిలోని వెంకంపల్లి సర్పంచ్ మురళీధర్ రెడ్డి దశదినకర్మ శనివారం స్వగ్రామంలో నిర్వహించగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అన్నారెడ్డిపల్లి తండాలో వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాచన్‌పల్లి తండాలో..



స్ఫూర్తితండాలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్



తుపుడగడ్డ తండాలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య



మేడిగడ్డ తండాలో ..

తండాల తలరాతలు మారాయ్

- గుడుంబ వాసనలు.... పెంటకుప్పల కంపులు లేవు
- కలెక్టర్ రవినాయక్



ఊరంచుతండాలో గిరిజనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ రవినాయక్

నవాబుపేట: గతంలో తండాల్లో గుడుంబా వాసనలు... పెంటకుప్పల కంపులతో ఉండేవని.. ప్రస్తుతం వాటి తలరాతలు మారాయని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఊరంచుతండాలో శనివారం గ్రామ పంచాయతి భవన భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కలిసి పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ సోనిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు తండాల్లో పాలించుకునే కల సాకారమైందన్నారు. గతంలో నిరక్షరాస్యత వల్ల గిరిజనులు ఆడపిల్లలను అమ్ముకునే వారని ప్రస్తుతం ఉన్నత చదువులు చదివించే స్థాయికి ఎదిగారన్నారు. తండాలో గిరిజన సాంప్రదాయం ఉట్టిపడుతుందని అభినందించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయంలో తండాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. ఉత్సవాల్లో గిరిజనులతో పాటు నృత్యం చేశారు. సీసీరోడ్లను ప్రారంభించారు. ఊరంచు తండా నుంచి వీరన్నపల్లి తండా వరకు బీటీ రోడ్డును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో రూ. 10 కోట్లతో గిరిజన తండాలకు అదనపు రోడ్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, శంకర్‌నాయక్, గోపాల్, రాములునాయక్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

రాజాపూర్: తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవం సందర్భంగా మండలంలోని మొత్కుల కుంటతండా, బీబీనగర్, సింగమ్మగూడతండాలో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనాలకు ఆయన భూమిపూజ చేశారు. సేవాలాల్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తండాలు గ్రామాలకు అనుబంధంగా ఉండేవని వచ్చిన నిధులు గ్రామాల్లోనే ఖర్చు చేసేవారని అన్నారు. కానీ నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పేరిబచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మాచన్‌పల్లి తండా సర్పంచ్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు మోతిలాల్, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి సరోజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అడ్డాకుల: జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ మూసాపేట మండలం స్ఫూర్తితండా గ్రామ పంచాయతీ వద్ద దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ స్వరూప, ఏఈ లక్ష్మణ్‌గౌడ్, సర్పంచులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగాముందలితాండ, అన్నారెడ్డిపల్లి, సంగాయపల్లి తండాల్లో నిర్వహించిన గిరిజన దినోత్సవంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఎంపీఓ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: ఎంపీపీ రమాదేవి శనివారం వీర్యానాయక్ తండాలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. అధికారులు తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి గోప్యానాయక్ తండాలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మన్నెమ్మ, ఎంపీఓ అనిల్, పంచాయితీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోటరాము పాల్గొన్నారు.

జడ్చర్ల: జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తుపుడగడ్డ తండాలో శనివారం నిర్వహించిన గిరిజనోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పంచలింగాల్ తండాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ మాధవి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మేడిగడ్డ, ఈదమ్మ గడ్డ తండా గిరిజన ఉత్సవాల్లో జెడ్పీటీసీ కల్యాణి పాల్గొని గిరిజనులతో కలిసి ఆడి పాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ నాయక్, సమ్యా, కిషన్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గోప్యానాయక్ తండాలో

మరోసారి ఆశీర్వదించండి



భూత్పూర్ పట్టణంలో తెలంగాణ వంటకాలను రుచిచూస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే ఎన్నికల్లో తమ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీలో దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని, అందులో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్వయంగా తయారు చేసిన తెలంగాణ వంటకాలను శనివారం ఆయన రుచిచూశారు. సీఎం కేసీఆర్‌తో తె లంగాణ రాష్ట్రంతో పాటు పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు సాధ్యమైందని, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. అనంతరం కొర్లవంపు తండా నుంచి కర్వెన వరకు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా భూత్పూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గడ్డ భారతమ్మ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డును ఎమ్మెల్యే ఆల, చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కమిషనర్ నజీబ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డికి ఆమె చూపించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు ఆమెను అభినందించారు. వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జల్సే ఫైజానే కాజ్మియా ధార్మికసభ

స్టేషన్ మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండల కేంద్రంలోని జామీయ మజీద్ ఆవరణలో నేడు (ఆదివారం) రాత్రి 8.30 గంటలకు ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు బజ్మే అంజుమనే ఖాద్రీయ కాజ్మియ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహ్మద్ ఖదీర్ కాజ్మియా ఆధ్వర్యంలో జరిగే సభలో ముఖ్యవక్తగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త షహెజాదే గౌసే ఆజం హజ్రత్ అల్లమా సయ్యద్‌షా ఆలే ముస్తఫా ఖాద్రీ అల్‌మారుఫ్ అలీపాష హాజరై సందేశం ఇస్తారని తెలిపారు. అదే విధంగా పలువురు మతపెద్దలు (ఖుల్ఫా) పాల్గొని ధార్మిక సందేశాలు ఇస్తారని తెలిపారు. పలువురు నాతేషరీఫ్‌లు ఆలపిస్తారని తెలిపారు. ధార్మిక సభలో పాల్గొనేవారికి భోజన వసతి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సభకు వెళ్లేవారికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి ఖాజా మైనద్దీన్, మహ్మద్ జాఫర్, మహ్మద్ మోసీన్‌కాజ్మి, ఖాజా కాజ్మి, అవేజ్, నజీర్ కాజ్మీ, సాధిక్‌పాష పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉత్తమ అవార్డు అందుకున్న స్థానిక 47వ వార్డుకు చెందిన జవాన్ యాదయ్యతో పాటు మరో ఏడుగురు పారిశుద్ధ్య కార్మికులను శనివారం కొత్తగంజిలో వీరహనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడు దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పారిశుద్ధ్య కార్మికులకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు.



కార్యక్రమంలో సంఘం సభ్యులు బోయ శ్రీను, రాకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

దేవరకద్ర రూరల్: ప్రజలందరూ సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ రజిత రెడ్డి అన్నారు. శనివారం బల్సుపల్లిలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని, ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసెజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. కార్డెన్‌సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. కార్యక్రమంలో 5 గురు ఎస్‌ఐలు, 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బస్సులో ల్యాప్ టాప్ అపహరణ

మహబూబ్‌నగర్ క్రైం: ఆర్టీసీ బస్సు సీటులో పెట్టిన ల్యాప్‌టాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. టూటౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం..కర్నూల్‌కు చెందిన అశోక్‌కుమార్ ఈనెల 14న హైదరాబాద్ నుంచి సీసీకుంటకు వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చాడు. ఆత్మకూర్ బస్సు ఎక్కాడు. ఆ తర్వాత ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను బస్సులోని పైన లాగేజ్ ఉంచే స్థలంలో పెట్టాడు. కాసేపు తర్వాత చూస్తే కన్పించలేదు. దీంతో ల్యాప్‌టాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని, రూ.60వేలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం : కేసునమోదు

జడ్చర్ల: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న నాగమణి ఈ నెల 15న బ్యాంక్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కలా, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తండ్రి పెంటయ్య శనివారం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలానగర్‌లో..

బాలానగర్: ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన జ్యోతి (23) శనివారం ఉదయం తల్లి గారింటికి వెళ్తానని చెప్పి శంషాబాద్‌కు బయలు దేరింది. కానీ ఆమె అక్కడ రాలేదని తెలియడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి వెంకటయ్య బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సంతాపం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బులి రమేష్‌గౌడ్ మృతి పై సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జిల్లా గోప సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరగనున్నట్లు వివరించారు.

దాయాదుల ఘర్షణ : కేసునమోదు

నవాబుపేట: పొలం వద్ద దాయాదుల ఘర్షణ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదూర్ గ్రామంలో శనివారం పొలం వద్ద పాలు పిండుతున్న అశోక్‌కుమార్‌పై దాయాదులు పవన్‌కుమార్, రామస్వామి, యాదయ్య దాడి చేసి గాయపరిచినట్లు అతని సోదరుడు శ్రీశైలం ఫిర్యాదు చేశాడని పోలీసులు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం దాయాదుల మధ్య గొడవ జరిగిందని, దాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం అశోక్ పై దాడి చేశారని తెలిపాడన్నారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లగా తనపైనా దాడి చేశారని శ్రీశైలం వివరించాడన్నారు. దీంతో ఇద్దరిని బంధువులు ఆస్పత్రికి తరలించారు. కాగా అశోక్ తీవ్ర గాయాలతో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్వల్పంగా గాయపడిన శ్రీశైలం చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొబైల్ అప్పగింత

బాలానగర్: మండల కేంద్రంలోని సంతలో చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను వెస్ట్ బెంగాల్ నుంచి రికవరీ చేసిన పోలీసులు ఎస్‌ఐ శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత వ్యక్తికి శనివారం అప్పగించారు. 4 నెలల క్రితం పోయిన ఫోన్‌ను రికవరీ చేసి అప్పగించినందుకు బాధిత వ్యక్తి మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు పాత దుస్తుల అందజేత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 15, 47వ వార్డుల్లో శనివారం రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పై మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక వాహనంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చిన్నదర్‌పల్లిలో దాతలు ముందుకు వచ్చి దుస్తులు అందజేశారు. సంజయ్‌నగర్‌లో చీర, ప్యాంటు, షర్టు ఒక్కొక్కటి దాతలు ఇవ్వగా.. ఆ వెంటనే పేదలకు అందజేశారు. ఆర్‌ఆర్‌ఆర్ స్పెషల్ ఆఫీసర్ మహేందర్, ఆర్‌పీలు కృష్ణవేణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని జిల్లా అదనపు ఎస్పీ రాములు అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మండల పరిధిలోని ఓబ్లాయిపల్లిలోని మణ్యంకొండ స్టేజీ వద్ద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.మహేష్, తహసీల్దార్ పాండు నాయక్, ఎంపీపీ సుధ, సర్పంచ్ చంద్రకళ, సీఐ రాజేశ్వర్‌గౌడ్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవస్థల ‘కార్యాలయాలు’

- మూసాపేటలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- అద్దె భవనాల్లో వసతుల్లేక అవస్థలు పడుతున్న ఉద్యోగులు
- ఆరేళ్లయినా మొదలు కాని స్థలాల ఎంపిక ప్రక్రియ



ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయం

అడ్డాకుల: మూసాపేట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు నేటికి సొంత భవనాలు లేదు. మండలం ఏర్పాటైన నాటి నుంచి అద్దె, ఇతర భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. వాటిలోనూ సరైన వసతులు లేక ఉద్యోగులు, పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త మండలంగా మూసాపేట ఏర్పాటై ఆరేళ్లవుతున్నా కొత్త భవనాల నిర్మాణం ఇంకా మొదలు కాలేదు. జిల్లాలు, మండలాల పునర్విభజనలో భాగంగా అడ్డాకుల మండలంలో ఉన్న మూసాపేటను 2016లో కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. అదే ఏడాది అక్టోబర్ 11న కొత్త మండలంలో మండల పరిషత్ కార్యాలయం మినహా ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. రెండేళ్ల తర్వాత మండల పరిషత్ కార్యాలయం కూడా ఏర్పాటైంది. కొత్త మండలంగా ఏర్పడి ఆరేళ్లు దాటినా ఇప్పటి వరకు కొత్త మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కోసం ఇప్పటి వరకు స్థలాల ఎంపిక ప్రక్రియను చేపట్ట లేదు.



నీటిపారుదలశాఖ భవనంలో పోలీస్ స్టేషన్

ఆదర్శలో రెవెన్యూ కార్యాలయం..

మండలంలోని రెవెన్యూ కార్యాలయాన్ని ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేయగా దాని దాని పక్కనే ఉన్న నీటిపారుదలశాఖ అతిథి గృహంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రెండు కార్యాలయాలు అక్కడే కొనసాగుతున్నాయి. 2019 జూన్‌లో మండల పరిషత్ కార్యాలయాన్ని అడ్డాకుల నుంచి విభజించి మూసాపేటలో కొత్తగా ఏర్పాటు చేశారు. అప్పటి వరకు మూసాపేట గ్రామంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. అందులోనే మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దానికి సమీపంలో ఉన్న రెండు గ్రామ పంచాయతీ దుకాణాలను ఖాళీ చేయించి అందులో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ఆదర్శ రిసోర్స్ సెంటర్ వస్త్ర దుకాణంలో మొదట ఏర్పాటు చేశారు. తర్వాత మూసాపేటలో నిర్మించిన రైతు వేదికలోకి మార్చారు. ఆరేళ్లలో కేవలం ఒక్క ఎంఈఓ కార్యాలయానికి మాత్రమే సొంత భవనాన్ని నిర్మించారు. కాగా మూసాపేట మండలంగా ఏర్పడినా ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. మండల కేంద్రంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మూసాపేట మండలంలో కొత్త మండల కార్యాలయాల సముదాయం ఎక్కడ ఏర్పాటు అవుతుందన్నది అందరిని ఉత్కంఠకు గురి చేస్తోంది. ప్రస్తుతం జాతీయ రహదారి పక్కన సంకలమద్ది గ్రామ పంచాయతీలోని బంగ్లగడ్డలో ఉన్న ఆదర్శ వద్ద రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌లను కొనసాగిస్తున్నారు. మండల పరిషత్, విద్య, వ్యవసాయ కార్యాలయాలు మాత్రం మూసాపేట గ్రామంలో ఉన్నాయి. ఈనేపథ్యంలో కొత్త మండల కార్యాలయ సముదాయం ఎక్కడన్నది చర్చకు దారి తీయనుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూసాపేటలోనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు...హైవేకు సమీపంలో ఏర్పాటు చేయాలని ఇతర గ్రామాల ప్రజలు కోరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్థలాల ఎంపికను చేపడితే అది ఉత్కంఠను రేకెత్తించే అంశమే అవుతుందనడంలో సందేహం లేదు.

స్థలాల ఎంపికకు ఆదేశాలు రాలేదు..

మూసాపేట మండలంలో కొత్త ప్రభుత్వ కార్యాలయాల సముదాయ నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించాలని ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొత్త కార్యాలయాల కోసం స్థలాలను ఎంపిక చేయాలని ఆదేశాలు వస్తే పరిశీలిస్తాం. ప్రస్తుతం ఉన్న కార్యాలయాల్లోనే ఉద్యోగులు పని చేస్తున్నారు.

– మంజుల, తహసీల్దార్, మూసాపేట